ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

సోమవారం 8 జూలై 2024

క్వార్టర్ల తొలగింపు సహేతుకం కాదు.. 8లో..

మూడేళ్లు దాటినా పూర్తికాని బీటీ రోడ్డు 8లో..



బొగ్గు బ్లాకుల వేలంపై అగ్గి రాజుకుంటున్నది

ప్రభుత్వానిది ప్రైవేటీకరణ దారి.. సంఘాలది తలో దారి..

గోదావరిఖని, జూలై 7: సింగరేణి బొగ్గు బాకుల వేలంపాట లొల్లి అగ్గి రాజుకుంటున్నది. ఈ అంశంపై కార్మిక సంఘాలు తలో దారిలో ప్రయనిస్తున్నాయి. ఐక్య ఉద్యమాలే శరణ్యమన్న కార్మిక సంఘాల ఎవరికి వారుగా బొగ్గు బ్లాకుల అంశంపై వార్ క్యాలెండర్లు ప్రకటిం చుకుని పోరాటాలు మొదలు పెట్టాయి. బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణపై గత నాలుగు సంవత్సరాలుగా సింగరేణిలో నిరసన జరుగు తూనే ఉన్నది. కానీ ఇప్పటికే కోయగూడెం, సత్తుపల్లి ఓసీపీ-3 వేలం పాటల్లో ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయి. ఇప్పుడు శ్రావణ పల్లి, కేకే6 వంతు వచ్చింది. కోయగూడెం, సత్తుపల్లి ఓసీపీల వేలం పాటల సందర్భంలో కూడా కార్మిక సంఘాలు అందుకు వ్యతిరే కమైన వైఖ రితో ఉద్యమాలు చేశాయి. కానీ కేంద్ర ప్రభుత్వం చిట్టచివరికి ఆ ప్రక్రియను విజయ వంతంగా ముగించింది. అప్పుడు గుర్తింపు సంఘంగా ఉన్న టీబీజీకేఎస్, రాష్ట్ర ప్రభు త్వంలో ఉన్న బీఆర్ఎస్ వాటికి వ్యతిరేకంగా స్పందించడం వల్ల టెండర్ ప్ర క్రియ రెండు సార్లు వాయిదా పడిందే తప్ప ఫలితం మాత్రం ప్రైవేట్‌పరం అయ్యింది. శ్రావణపల్లి, కేకే-6 టెండర్ ప్రక్రియ ప్రారం భమైంది. ఈ ప్రాజెక్టులు సింగరేణికి దక్కే విధంగా ఎంఎండీఆర్ చట్టంలోని ఆర్టికల్-17 ప్రకారం అవకాశం ఉంది. ఖనిజ సంపద ఉన్న ప్రాంతంలో ప్రభుత్వరంగ సంస్థలు వాటిని వెలికితీసేందుకు ఆసక్తి చూపితే కొన్ని రాయితీలతో వాటిని అప్పగించాలని ఆర్టికల్-17 చెబుతుంది.

● మనుగడ ప్రశార్థకం..

సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు కూడా ఇప్పుడు లేవు కదా, కార్మిక సంఘాలు తమ వ్యక్తిగత ప్రతిష్ట కోసం ఎందుకు వేరు వేరుగా పోరాటాలు చేస్తున్నాయని కోల్‌బెల్ట్‌లో వాపోతున్నారు. సింగరేణి సంస్థ మనుగడ ప్రశ్నార్థకమైతే కార్మిక సంఘాల మనుగడ కూడా లేకుండా పోతుందనే సామాన్యమైన విషయాన్ని కూడా కార్మిక సంఘాలు ఎందుకు స్పృహలోకి తెచ్చుకోవడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ అంశం సింగరేణి పరిధిలోనిది అయినప్పటికీ ఈ విషయంపై కోల్‌బెల్ట్ సమాజాన్ని కూడా భాగస్వామ్యం చేయాల్సిన అవసరం ఉన్నదని మేధావుల ఆలోచన. వేరువేరు ఎజెండాలతో, వేరువేరు జెండాలో ఒకేరకమైన నిరసనలు తెలుపుతున్న సింగరేణిలోని క్రియాశీల కార్మిక సంఘాలు ఇప్పటికైనా బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐక్యపోరాటాలు, సమష్టి పోరాటాలకు సంసిద్ధం కావాల్సిన చారిత్రాత్మక అసవరం కనిపిస్తున్నది. ఒకవేళ శ్రావణపల్లి, కేకే-6 బాక్లులు వేలం పాటల్లో ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళితే కేవలం ఐదేళ్ల కాలంలోనే సింగరేణి భవిష్యత్ ప్రశ్నార్ధంగా మారే ప్రమాదం ఉంది. ఇన్ని పోరాటాలు జరుగుతున్నా.. రాష్ట్ర ప్రభుత్వం ఈ బ్లాకులను సింగరేణి కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నా కేంద్రం మాత్రం బొగ్గు బ్లాకుల వేలాన్నియధాతథంగా కొనసాగించడంతో పాటు ఇది ప్రైవేటీకరణ కాదు అనే విషయాన్ని పదేపదే నొక్కి చెబుతూ వస్తున్నది. ఈ రెండు బ్లాకులు జాతీయ సంపదగా పేర్కొంటున్న కేంద్ర ప్రభుత్వం సింగరేణి పరిధిలో ఉన్న అంశాన్ని అంత విలువైన విషయంగా పరిగణించడం లేదు.

● స్పష్టత కరువు..

కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ఈ రాష్ట్రానికి సంబంధించిన కిషన్‌రెడ్డి అయినప్పటికీ బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించే అంశంపై స్పష్టత ఇవ్వడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఇది ప్రైవేటీకరణ కాదు, వేలం పాటల్లో సింగరేణి పాల్గొనవచ్చునని సన్నాయి నొక్కులు నొక్కుతున్నది. ఈ లొల్లిలో దేశ వ్యాప్తంగా 66బొగ్గు బ్లాకులకు వేలం పాటలు జరుగుతున్న సందర్భంలో సింగరేణి యాజమాన్యం కూడా కేవలం సింగరేణిలోని రెండు బ్లాకుల అంశాన్నే చూడకుండా 62బొగ్గు బ్లాకులను దక్కించుకునేందుకు సింగరేణి వేలం పాటల్లో పాల్గొంటే దేశ వ్యాప్తంగా జరుగుతున్న ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి సంకేతం ఇచ్చినట్టు అవుతుందని సింగరేణిలోని కొందరు అధికారులు మెల్లగా ఇప్పుడిప్పుడే నోరు విప్పుతున్నారు. మొత్తం సింగరేణి సంస్థ భవిష్యత్‌నే ప్రశ్నార్థకం చేస్తున్న శ్రావణపల్లి, కేకే-6 బొగ్గు బ్లాకుల వేలం పాటల అంశంపై కార్మిక సంఘాలు ఐక్య కార్యాచరణను రూపొందించుకోక పోవడం అనేది సింగరేణిలో అనేక అనుమానాలను, ప్రశ్నలను రేకెత్తిస్తున్నది. కార్మికుల చిన్న ఆర్థిక ప్రయోజనాల కోసం, లేదా హక్కుల సాధన కోసం జేఏసీలుగా ఏర్పడి ఐక్య పోరాటాలు నిర్వహించిన సింగరేణి కార్మిక సంఘాల స్పృహ ఇప్పుడు ఎందుకు లేకుండా పోయిందనేది చర్చకు వస్తున్నది. యావత్తు సింగరేణి భవిష్యత్‌ను ప్రశ్నార్థం చేస్తున్న వేలం పాటల అంశంపై కార్మిక సంఘాలకు ఎందుకు తీవ్రత లేదనేది కార్మికవర్గం యోచిస్తున్నది. సింగరేణిలో పని చేస్తున్న ప్రస్తుత కార్మికులు ఈ బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణపై సీరియస్‌గా స్పందించడం లేదని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. కానీ డిపెండెంట్ ఎంప్లాయిమెంట్ కొనసాగుతున్న సింగరేణిలో కార్మికులు తమ పిల్లల భవిష్యత్ కోసమైనా బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రతిస్పందించాల్సి ఉందని మావోయిస్టు పార్టీ ర్యాడికల్స్ పేర ఒక ప్రకటన వెలువరించింది.

కానీ ఈ అంశాన్ని ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కానీ, సింగరేణి యాజమాన్యం కానీ ఈ అంశం పట్ల ఆసక్తి కనబర్చడం లేదు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి ఈ బొగ్గు బ్లాకులను దక్కించుకునేందుకు వేలం పాటలో పాల్గొంటుందని చెబుతుందని చెబుతుంటే ఈ రెండు బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రిని కోరారు. ఈ వైరుధ్యం ఇలా ఉండగా సింగరేణిలో గుర్తింపు సంఘంగా గెలిచిన ఏఐటీయూసీ తన పోరాటాల షెడ్యూల్‌ను ప్రకటించుకున్నది. కలెక్టరేట్ల ముందు ధర్నాలు చేసింది, సింగరేణి జీఎం కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలకు సిద్ధమైంది. ఐఎన్‌టీయూసీ తన కోర్ కమిటీలో బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రణభేరిని ప్రకటించింది. టీబీజీకేఎస్ జూలై 2నుంచి క్యాలెండర్ నిరసన కార్యక్రమాలను చేస్తూనే ఉన్నది. ఇక హెచ్ఎంఎస్, ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ, టీఎన్‌టీయూసీ ఇతర సంఘాలు కలిసి ఐక్య వేదికగా ఏర్పడి హైదరాబాద్ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి పోరాటాలకు సిద్ధమైంది. మావోయిస్టు పార్టీ కోల్‌బెల్ట్ ఏరియా కమిటీ కూడా సింగరేణి బొగ్గు బ్లాకుల వేలానికి వ్యతిరేకంగా పోరాటాలకు పిలుపుని స్తూనే ఐక్య కార్యాచరణగా కార్మిక సంఘాలు ముందుకు వెళ్లాలని సూచన చేసింది. బీఎంఎస్ ఈ అంశంపై తటస్థతను వ్యక్తం చేస్తూ పరనింద ఆరోపణలకు పూనుకుం టున్నది. ఇంత జరుగుతున్నా సింగరేణి యాజమాన్యం మాత్రం బొగ్గు బ్లాకుల వేలం అంశంపై ఇప్పటికీ తన వైఖరిని, తన కార్యాచరణను ప్రకటించలేదు.

మల్లన్న క్షేత్రంలో భక్తుల సందడి



ఆలయంలో పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

ఓదెల, జూలై 7 : భక్తులందరికి ఇలవేల్పు దైవమైన భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు ఘనంగా పూజలను నిర్వహించారు. ఇదే నెలలో అగ్నిగుండం, పెద్దపట్నం మహోత్సవం ఉన్నందున ముందస్తుగా భక్తులు తరలి వచ్చి మొక్కులను సమర్పించడం ఆనవాయితి. ఈమేరకు వివిధ జిల్లాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పట్నాలు, బోనాలు, కోడే మొక్కులను, కావడితో స్వామివారికి మొక్కులను, అలాగే స్వామి వారికి తలనీలాలను సమర్పించారు. అలాగే మదన పోచమ్మ, బంగారు పోచమ్మ, వీరభద్రస్వామి వారికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులను సమర్పించారు.

కొనసాగుతున్న ఎప్‌సెట్ సర్టిఫికెట్ల పరిశీలన



విద్యార్థిని సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారి

కోల్‌సిటీటౌన్, జూలై 7: గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎప్‌సెట్-2024 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం కొనసాగుతున్నది. రెండవ రోజు ఆదివారం సుమారు 400 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరిశీలన పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈనెల 15వ వరకు వెబ్ ఆప్షన్స్ ఇవ్వాలని హెల్ప్‌లైన్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.సురేష్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రమాకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశీలన అధికారులు డాక్టర్ రవి, రమేష్, ప్రసాద్, అజయ్ కుమార్, యాదయ్య, సావిత్రి పాల్గొన్నారు.

యైటింక్లయిన్ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే



నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 7: డివిజన్ బాటలో భాగంగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఆదివారం కాలనీలో పర్యటించారు. కాలనీలోని 17, 18వ డివిజన్లలో పాదయాత్ర ద్వారా స్థానికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నాలాలు, కాల్వలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. పారిశుధ్యంలో అధికారుల నిర్లక్ష్యం చూపితే తనకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అల్లూరు ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలను ఉన్నత పాఠశాలగా అభివృద్ధి చేస్తామన్నారు. కాలనీలోని ఐదు డివిజన్లలో మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని మక్కాన్‌సింగ్ అన్నారు. ఎమ్మెల్యే వెంట జీఎం సూర్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు గుండేటి రాజేష్, మారెల్లి రాజిరెడ్డి, సాగంటి శంకర్, శంకర్‌నాయక్, చక్రపాణి, కిషన్‌నాయక్, తిరుపతిరెడ్డి, సారయ్యనాయక్ ఉన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

- టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జాతీయ కార్యవర్గ సభ్యుడు నగునూరి శేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ కార్యవర్గ సభ్యుడు నగునూరి శేఖర్

కమాన్‌పూర్, జూలై 7 : జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జాతీయ కార్యవర్గ సభ్యుడు నగునూరి శేఖర్ అన్నారు. ఆదివారం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా కార్యవర్గ సమావేశం మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు బుర్ర సంపత్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నగునూరి శేఖర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టుల పాత్ర కీలకమైందని, జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కాకపోవడం బాధాకరమన్నారు. వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్ర సంపత్‌కుమార్, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు వంశీ దయానంద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కోల లక్ష్మణ్, గాండ్ల శ్రీనివాస్, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

గోదావరిఖనిలో రౌడీషీటర్ల దాష్టీకం

- పంచాయితీలో జోక్యం చేసుకుంటున్నాడంటూ హత్యాయత్నం

కోల్‌సిటీ, జూలై 7: గోదావరిఖని పట్టణంలో కొందరు రౌడీషీటర్లు ఆదివారం రాత్రి స్థానిక 7ఎల్ఈపీ కాలనీ సమీపంలో ఒక వ్యక్తిని తీసుకెళ్లి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఒక పంచాయితీ విషయంలో జోక్యం చేసుకుంటున్నావంటూ బీరు సీసాలతో కొట్టడంతో స్థానిక మార్కండేయకాలనీకి చెందిన నగేష్(30) అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనకు సంబంధించిన బాధితుడు తెలిపిన వివరాలు. విఠల్ నగర్‌కు చెందిన రౌడీషీటర్ గడ్డం సతీష్ అలియాస్ కుక్కల సతీష్, స్థానిక విఠల్ నగర్ పోస్టాఫీస్ ఏరియాకు చెందిన బండి శ్రీకాంత్ అనే పాత నేరస్తుడు ఆదివారం నగేష్‌పై దాడికి పథకం వేశారు. సతీష్, శ్రీకాంత్‌తో పాటు మరికొందరు స్థానిక ఫోరింక్లయిన్‌గడ్డ వద్ద మద్యం సేవించి నగేష్‌ను పిలిచారు. అక్కడి నుంచి నగేష్‌ను బలవంతంగా 7ఎల్ఈపీ కాలనీ వైపు తీసుకెళ్లారు. అక్కడ ఒక పంచాయితీలో అతిగా జోక్యం చేసుకుంటున్నావంటూ బీరు సీసాలు పగులగొట్టి దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో నగేష్‌తో పాటు శ్రీకాంత్‌కు గాయాలయ్యాయి. దాడికి పాల్పడిన వారు పది మంది ఉన్నారని నగేష్ పేర్కొంటున్నాడు. శ్రీకాంత్‌కు గతంలో ఒక హత్య కేసులో జీవిత ఖైదు పడగా, హై కోర్టులో కేసు కొట్టివేయడంతో విడుదలయ్యాడు. సతీష్‌కు నేరచరిత్ర ఉంది. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

ఖనిలో చోరీ

కోల్‌సిటీ, జూలై 7: గోదావరిఖని గణేష్‌నగర్‌లో ఆదివారం చోరీ జరిగింది. ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రెండు తులాల బంగారం, పావుకేజీ వెండిని దొంగలు ఎత్తుకెళ్లినట్టు గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. గణేష్‌నగర్‌లో నివాసముండే అంగన్‌వాడీ టీచర్ స్వర్ణలత శనివారం ఇంటికి తాళం వేసి పెద్దపల్లికి వెళ్లగా ఆదివారం సాయంత్రం వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోని బంగారం, వెండిని ఎత్తుకెళ్లినట్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వీధి దీపాలు ఏర్పాటు చేయండి

పెద్దపల్లి రూరల్, జూలై 7: మండలంలోని పెద్దబొంకూర్ నుంచి కొత్తపల్లి గ్రామానికి వెళ్లే రహదారిని వెడల్పులో భాగంగా డబుల్ రోడ్డు వేశారు. అయితే గ్రామాలకు వెళ్లాలంటే చీకటిలోనే ప్రయాణించాల్సి వస్తుందని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్థుడు మిట్టపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శికి విన్నవించగా, పంచాయతీ పరిధిలో కాదని, పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోకి వస్తుందని పేర్కొనట్లు శ్రీనివాస్ తెలిపారు. ఇటువైపు వెళ్లే వాహనదారులు, నడుచుకుంటూ వెళ్లే వారికి రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నాడు.

పదవులకు మాత్రమే విరమణ..

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పు ఈశ్వర్

పెద్దపల్లిటౌన్, జూలై 7: ఎంపీపీలు, వైస్‌ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఉపసర్పంచ్‌ల పదవులకు మాత్రమే విరమణ పొందారని ప్రజాసేవకు కాదని మాజీ మంత్రి ఈశ్వర్, జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్‌లు పేర్కొన్నారు. స్థానిక టీఆర్ఎస్ భవన్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన సన్మాన సభకు హాజరై వారు మాట్లాడారు. ప్రజాప్రతినిధులుగా అవకాశాలు రావడమే గొప్పని, ప్రజాప్రతినిధులు కావడం అదృష్టమని, వచ్చిన అవకాశాన్ని గౌరవించి 5 ఏళ్ల ప్రజల సేవల్లో పనిచేస్తారో వారే చిరస్థాయిగా ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. గతంలో కేసీఆర్ పాలనలో అన్ని విధాలా అభివృద్ధి పాటు సంక్షేమ పథకాలు అమలు చేశాడన్నారు. గెలుపు, ఓటములు సాధారణమన్నారు. పదవుల ఆశ కోసం కొంతమంది పార్టీ మారుతున్నారని, పార్టీ మారితే వాళ్లకు ఉన్న విలువలు తగ్గుతాయన్నారు. వారితో పార్టీకి ఏలాంటి నష్టం లేదన్నారు. అనంతరం మాజీ ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ మీ అందరి సహకారంతో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసుకున్నామని, ప్రజలందరికీ సంక్షేమ కార్యక్రమాలను కేసీఆర్ సారథ్యంలో అందించామన్నారు. వర్షాకాలం వస్తే నీరు నిలిచి కప్పలు చేరుతాయని, ఎండాకాలం వస్తే నీరున్న చోటికి కప్పలు వెళ్తాయని, ఇప్పుడు పార్టీకి ఎండాకాలమని అసలైన కార్యకర్తలందరూ పార్టీలోనే ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, ఎంపీపీ బాలాజీరావు పెద్దపల్లి బండారి స్రవంతి నూనెటి సంపత్, స్రవంతి మోహన్‌రావు, కుసుకుంట్ల రమాదేవి రాంగోపాల్, గంట రాములు, ఉప్పు రాజ్‌కుమార్, దాసరి ఉష తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ వేడుకలు

కళ్యాణ్‌నగర్, జూలై 7: ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఆదివారం గోదావరిఖని చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్ పట్టణ అధ్యక్షుడు మాతంగి కుమార్ ఆధ్వర్యంలో జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బచ్చల రజనీకాంత్, ఉప్పులేటి పర్వతాలు మాట్లాడుతూ 30సంవత్సరాల క్రితం ప్రకాశం జిల్లా ఈదుమూడి గ్రామంలో ఏర్పడిన ఎంఆర్‌పీఎస్ ఎన్నో సామాజిక ఉద్యమలు చేసిందని, మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసి ఆరోగ్యశ్రీ, వృద్ధులకు, వికలాంగులకు పెన్షన్ ఇప్పించిన ఘనత మందకృష్ణకే దక్కుతుందన్నారు. ఎస్‌సీ వర్గీకరణ చేయాలంటూ మంద కృష్ణమాదిగ అనేక పోరాటాలు చేశారని, త్వరలోనే వర్గీకరణ కూడా సాధంచుకుంటామని తెలిపారు. మాదిగలకు సామాజిక న్యాయం జరుగాలంటే మంద కృష్ణమాదిగ నాయకత్వాన్ని బలపర్చాలని పిలుపునిచ్చారు. అనంతరం మంద కృష్ణమాదిగ జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో రాసపల్లి రవికుమార్, పల్లె బాపు, దశరథం, రాజన్న, నర్సింగం, రమేష్, బాబా పాల్గొన్నారు.

అంధకారంలో గోదావరిఖని చౌరస్తా..



గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో వెలగని లైట్లు

కళ్యాణ్‌నగర్, జూలై 7: నిత్యం రద్దీతో ఉండే గోదావరిఖని చౌరస్తాలో పది రోజులుగా లైట్లు వెలుగకపోవడంతో అంధకారంగా మారింది. మున్సిపల్ టీ జంక్షన్ నుంచి ఫైవింక్లయిన్‌కు వెళ్లే రహదారి అయిన ప్రధాన చౌరస్తాలో హైమాస్ట్ విద్యుత్ లైట్లు వెలగక పోవడంతో రాత్రివేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దూర ప్రాంతాల నుంచి లక్ష్మీనగర్‌కు వచ్చే ప్రజలు లైట్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై గుంపులుగా పశువులు సంచరిస్తుండడంతో వాహనదారులు వాటిని ఢీకొట్టి గాయాలపాలవుతున్నారు. విద్యుత్ దీపాలు మరమ్మతు చేయాలని కార్పొరే షన్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోనూ..

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో తరచూ విద్యుత్ కోతలతో జనం సతమతమవుతున్నారు. ఆదివారం రాత్రి గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రోగుల విలవిలలాడారు. సెల్‌ఫోన్ లైట్ల వెలుతురుతో కాలం గడిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే విద్యుత్ లైన్లలో తరచూ లోపాలు తలెత్తుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారంరాత్రి సుమారు గంటన్నర పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రోగులు పరేషాన్ అయ్యారు. పేరుకే పెద్ద ఆసుపత్రి అయినా జనరేటర్‌కు దిక్కులేకుండా పోయింది. ఆసుపత్రిలో రోజుకు సుమారుగా 10 నుంచి 20 ఆపరేషన్లు జరుగుతున్నాయి. చీకట్లో ఏమి కనిపించక రోగులు, వారి బంధువులు అవస్థలుపడ్డారు. జనరేటర్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసినా సూపరింటెండెంట్ మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గాడి తప్పిన గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించడానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కృషి చేయాలని, ఆసుపత్రిలో జనరేటర్ ఏర్పాటుచేసి విద్యుత్ కష్టాలు తీర్చాలని రోగులు వేడుకుంటున్నారు. గత నెలలో కూడా తరచూ విద్యుత్ అంతరాయం కలుగడంతో పెద్దపల్లి ఎస్ఈ సుదర్శన్, మంథని డీఈ ఈశ్వర్‌ప్రసాద్ ఆధ్వర్యంలో కరెంటు నిరంతరం అందించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రి సిబ్బందితో కూడా చర్చలు జరిపి విద్యుత్ సమస్య లేకుండా చేస్తామని హామీ కూడా ఇచ్చారు. అయినప్పటికీ తరచూ విద్యుత్ కోతలతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు.



ఎన్టీపీసీలో దక్షిణ రీజియన్ స్పోర్ట్స్‌మీట్ ప్రారంభం

- క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఈడీ కేదార్ రంజన్


మార్చ్‌పాస్ట్ చేస్తున్న ఎన్టీపీసీ జట్లు

జ్యోతినగర్, జూలై 7: రామగుండం ఎన్టీపీసీలో ఆదివారం ఎన్టీపీసీ దక్షిణ రీజియన్ స్పోర్ట్స్ మీట్ (ఎస్ఆర్ఎస్ఎం) 2024 ఘనంగా ప్రారంభమైంది. పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని మహాత్మగాంధి స్టేడియంలో రామగుండం, తెలంగాణ ఎస్టిపిపి ఈడీ కేదార్ రంజన్ పాండు స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. ఈ స్పోర్ట్స్ మీట్‌లో దక్షిణ రీజియన్‌కు చెందిన రామగుండం, సింహాద్రి(విశాఖపట్నం) ఎన్టీపీసీ, కుడిగి ఎన్టీపీసీ (కర్నాటక), వల్లూర్(తమిళనాడు), ఎస్ఆర్‌హెచ్‌క్యూ(హైదరాబాద్) జట్లు పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా ఈడీ కేదార్ రంజన్ వివిధ జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడా జ్యోతిని వెలిగించి ఈనెల 10వరకు జరిగే పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. పురుషులకు క్రికెట్, మహిళా ఉద్యోగులకు బ్యాడ్మింటన్ ఈవెంట్లలో పోటీలు నిర్వహిస్తున్నారు. క్రికెట్ పోటీలు మహాత్మగాంధి స్టేడియంలో, బ్యాడ్మింటన్ పోటీలు స్పందన (సీనియర్ హాల్) ఇండోర్ స్టేడియంలో జరుగుతున్నాయి. ఎన్టీపీసీ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరుగుతున్న స్పోర్ట్స్ మీట్ ప్రారంభ కార్యక్రమంలో దక్షిణ రీజియన్ హెచ్ఆర్ సీజీఎం పాణిగ్రహి, ఎన్‌టీసీ సభ్యుడు బాబర్ సలీంపాషా, దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు చిన్మయి దాస్, స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు సంతోష్ తివారి, కార్యదర్శి భానేశ్వర్, గుర్తింపు కార్మిక సంగం అధ్యక్ష, కార్యదర్శులు యుగంధర్‌రావు, ఆరెపల్లి రాజేశ్వర్, ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

● క్రీడలతో బహుళ ప్రయోజనాలు..

క్రీడల వల్ల బహుళ ప్రయోజనాలున్నాయని, శారీరక, మానసిక ధారుఢ్యం పెంపొందుతుందని ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు అన్నారు. దక్షిణ రీజియన్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రాంభించిన అనంతరం ఈడీ ప్రసంగిస్తూ ఎన్టీపీసీ విద్యుత్ ఉత్పత్తితో పాటు క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. కోవిడ్ కారణంగా నాలుగేళ్లుగా ఎస్ఆర్ఎస్ఎం పోటీలను నిర్వహించ లేకపోయామని, భవిష్యత్‌లో క్రీడా టోర్నమెంట్లను నిర్వహిస్తామన్నారు. ఉద్యోగులు క్రీడలపై ఆసక్తి కనబర్చాలని తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు.

● మొదటి మ్యాచ్‌లో రామగుండం గెలుపు..

ఎస్ఆర్ఎస్ఎంలో భాగంగా మొదటి రోజు జరిగిన ప్రారంభ క్రికెట్ మ్యాచ్‌లో రామగుండం జట్టు కుడిగి ఎన్టీపీసీ జట్టుపై 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన కుడిగి జట్టు నిర్ణీత 12 ఓవర్లలో9 వికెట్లు కోల్పోయి 78 పరుగులు మాత్రమే చేసింది. 79 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన రామగుండం జట్టు 9.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించింది. రామగుండం బ్యాట్స్‌మెన్ వంశీ 19 బంతుల్లోనే 41 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కాగా, మహిళలకు జరిగిన బ్యాడ్మింటన్ పోటీలలో సింగిల్స్, డబుల్స్‌లో రామగుండం ప్లేయర్లు గెలుపొందారు.


ఆత్మహత్య సంఘటనలో ఐదుగురిపై కేసు నమోదు


శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

ఓదెల, జూలై 7: మండలంలోని జీలకుంటలో వంగల శ్రీకాంత్‌రెడ్డి (36) ఆత్మహత్య సంఘటనలో ఆదివారం ఇదే గ్రామానికి చెందిన గొట్టే నాగరాజు, గొట్టే యశోద, గొట్టే స్రవంతి, దండు సదయ్య, రౌతు మనోజ్ క్రాంతివీర్‌పై ఆది వారం కేసు నమోదు చేశామని. పొత్కపల్లి ఎస్ఐ అశోక్‌రెడ్డి తెలిపారు. మృతుడి తల్లి వంగల సుజాత ఐదుగురు వ్యక్తులపై పొత్కపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వివరాలు ఇలా ఉన్నాయి. జీలకుంటకు చెందిన గొట్టే నాగరాజు, గొట్టే యశోద, గొట్టే స్రవంతి, దండు సదయ్య , రౌతు మనోజ్ క్రాంతి వీర్ కలిసి సర్వే నంబర్ 400/బి/2 లోని 2.15ఎకరాల వ్యవసాయ భూమిని అక్రమంగా కబ్జా చేయాలని కుట్రలు చేశారన్నారు. దీంతో సుల్తానాబాద్ కోర్టులో కేసువేసి ఇంజక్షన్ ఆర్డర్ తీసుకున్నామని, ఈ ఆర్డర్ వచ్చిన తరువాత కూడా తన కొడుకును బెదిరి స్తూ ఇష్టం వచ్చినట్లు చితకబాదారని సుజాత తెలిపింది. ఇకనుంచి భూమి కాడికి వస్తే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు పెడుతామని బెదిరించారని తెలిపారు. కొడుకుతో వ్యవసాయ పనులకు వెళ్లగా అక్కడ ఉన్నవారు తమవైపు చూస్తూ తీవ్రపదజాలంతో అవమానించారని, ఇది భరించలేక తన కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. చావుకు కారకులైనా వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి తల్లి వంగల సుజాత ఫిర్యాదులో పేర్కొంది.

ప్రకృతిరమణీయం పాండవుల లొంక

- పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని కోరుతున్న ప్రజలు


పాండవలొంక నుంచి పారే జలపాతం


బండలపై పాండవుల బొమ్మలు

కాల్వశ్రీరాంపూర్, జూలై 7: మండలంలోని జాఫర్‌ఖాన్‌పేట శివారులో ఉన్న పాండవుల లొంక వర్షాకాలంలో రామగిరికొండల నుంచి వచ్చే వర్షపునీరు పాండవలొంకలో జలపాతమై చూపరులను ఎంతో ఆకట్టుకుంటుంది. ఈ గుట్ట ప్రాంతంలో పాండవులు అరణ్యవాసం చేసినప్పుడు ఇక్కడే కొన్ని రోజులు నివాసమే ఏర్పాటు చేసుకొని ఉన్నట్లుగా పెద్దలు చెబుతుంటారు. అందుకే దీనిని పాండవలొంక అని పేరు వచ్చిందని చుట్టుపక్కల గ్రామస్థులు తెలుపుతున్నారు. పాండవ లొంకలో పాండవుల బొమ్మలతో పాటు ఆంజనేయ స్వామి విగ్రహం, జలపాతం, పచ్చని చెట్లతో వర్షాకాలంలో ఈ ప్రాంతమంతా ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. జాఫర్‌ఖాన్‌పేటకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ పాండవలంక ప్రాంతానికి వెళ్లేందుకు రెండు కిలోమీటర్ల వరకు మట్టి రోడ్డు వేశారు. మరొక కిలో మీటర్ వెళ్లేందుకు దారి లేక కొండల ప్రాంతం నుంచే నడిచి పాండవులొంకకు పర్యాటకులు చేరుకుంటారు. పాండవ లొంకను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని 20సంవత్సరాలుగా ఆ ప్రాంతవాసులు సంబంధిత ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నోసార్లు విన్నవించారు. విన్నపాలు కాగితాల వరకే పరిమితమయ్యాయని జాఫర్‌ఖాన్‌పేట, కునారం గ్రామస్తులు పేర్కొంటున్నారు. శ్రావణమాసంలో జాఫర్‌ఖాన్ పేట, కూనారం గ్రామ ప్రజలు పాండవలొంకకు వనభోజనాలకు వెళుతుంటారు. రామగిరి కొండలనుంచి పారే నీరు జలపాతమై పాండవలంక నుంచి జారి పడుతుంటే ఆ జలపాతం కింద స్నానాలు చేస్తూ ఆనంద ఉత్సవాలతో పర్యాటకులు ఆ ప్రాంతంలో గడుపుతుంటారు. అటవీ ప్రాంతం నుంచి వచ్చే నీరు ఎన్నో వనమూలికలతో కలవడంతో సర్వరోగ నివారిణి ఆ నీరు అనుకొని చుట్టుపక్కల వారు ఆ నీటిని తెచ్చుకొని తాగుతుంటారు. పాండవలొంక ప్రాంతం వెన్నంపల్లి, జాఫర్‌ఖాన్‌పేట, కూనరం ఈ మూడు గ్రామాలకు దగ్గరగా ఉంటుంది. జాఫర్‌ఖాన్‌పేట నుంచే దారి ఉన్న కారణంగా పర్యాటకులు వర్షాకాలంలో ఈ ప్రాంతాన్ని సందర్శిస్తుంటారు. జాఫర్‌ఖాన్‌పేట గ్రామం నుంచి పాండవ లొంక ప్రాంతం వరకు రహదారిని నిర్మించి, ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఈ ప్రాంతాన్ని సందర్శించిన పర్యాటకులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ప్రభుత్వం కోరుతున్నారు.







గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకుల అరెస్ట్

పాలకుర్తి, జూలై 7: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కన్నాల టోల్ ప్లాజా వద్ద అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆదివారం బసంత్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. టోల్ ప్లాజా వద్ద స్థానిక పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా కనిపించిన రామరావుపల్లి గ్రామానికి చెందిన రావుల నవీన్, గొల్లపెల్లి నరేంద్రలను తనిఖీ చేశారు. వారి వద్ద గంజాయి లభించినట్లు, వారు మహారాష్ట్ర ప్రాంతం నుంచి తీసుకువస్తున్నట్లు తెలిసిందని పోలీసులు తెలిపారు.

గంజాయి సరఫరా నిందితులపై కేసు

రామగిరి, జూలై 7: గంజాయి సరఫరా చేస్తూ పట్టుబడిన ఐదుగురు నిందితులను ఆదివారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు రామగిరి పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సందీప్‌కుమార్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మండలంలోని లద్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఓసీపీ-2 వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా నాగేపల్లి గ్రామానికి చెందిన కొండవేన అనిల్, తన స్నేహితులు కొండపాక రవీకిరణ్, జాడి రాజేష్, ఎరుకల భాస్కర్, సుతారి శ్రీకాంత్ అనే వ్యక్తులు మోటర్ సైకిల్స్‌పై శనివారం నాగేపల్లి ఎక్స్‌రోడ్ వైపు గంజాయి విక్రయానికి వెళ్తుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుపడినట్లు సీఐ తెలిపారు. వారి వాహనాలతో పాటు సెల్‌ఫోన్‌లను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. నిందితుల వద్ద పట్టుకున్న గంజాయి విలువ రూ. 75,000 వరకు ఉంటుందని అంచనా వేశారు. నిందితులపై కేసు నమోదు చేసి మంథని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఎవరైనా గంజాయి అమ్మడం కానీ తాగడం చేసినట్లైయితే చర్యలు చేపడతామని సీఐ హెచ్చరించారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి


వేణు(ఫైల్)

పెద్దపల్లిటౌన్, జూలై 7: లారీ ఢీకొన్న ఘటనలో ఆదివారం ఓ వ్యక్తి మృతి చెందాడు. జిల్లా కేంద్రంలోని హన్మాన్‌నగర్‌కు చెందిన కాసనగొట్టు వేణు(50) ఎల్ఐసీ ఏజెంటుగా, మెడికల్ స్టోర్ నడుపు కుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం కమాన్‌పూర్ మండలం గుండారం వెళ్తుండగా మంథని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద మంథని వైపు మలుపు తిప్పుతుండగా గోదావరిఖని నుంచి వస్తున్న బూడిద ట్యాంకర్ లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో వేణుకు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్‌కు తరలించారు. అక్కడి ఆస్పత్రి వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. మృతుడు వేణు భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కొడుకులు సాయివిఘ్నేష్, అనీష్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం


శంకర్(ఫైల్)

సుల్తానాబాద్, జూలై 7: సుల్తానాబాద్ పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. సుల్తానాబాద్ సుభాష్‌నగర్‌కు చెందిన న్యాతరి శంకర్ (50) అనే వ్యక్తి కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం రాత్రి కూలీ పని చేసుకుని ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా యాదవనగర్ రైల్వేస్టేషన్ రోడ్డు వైపు వస్తున్న భారీ క్రేన్ ఢీకొంది. దాంతో శంకర్ అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడికి భార్య రజితతో పాటు కూతురు స్వప్న, కొడుకు శ్రీనివాస్ ఉన్నారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ప్రమాదం జరిగిన తీరు ఆరా తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కన్నుల పండవగా పెద్దమ్మ బోనాల జాతర





బోనాల శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు, బోనం ఎత్తుకున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

కోరుట్ల, జూలై 7: ఆషాడమాసం పురస్కరించుకొని పట్టణంలోని ముదిరాజు సంఘ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పెద్దమ్మ బోనాల జాతర కన్నుల పండవగా సాగింది. పట్టణంలోని ముదిరాజు సంఘ సభ్యుల ఆధ్వర్యంలో అయిలాపూర్ రోడ్డులోని పెద్దమ్మ దేవాలయంలో పోతరాజులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించంగా మహిళలు బోనాల నెత్తిన పెట్టుకోని శోభయాత్ర నిర్వహించారు. శోభయాత్ర పట్టణంలోని పలు వార్డుల నుండి శోభయాత్రగా అయిలాపూర్ రోడ్డు వద్దకు వచ్చిన బోనాలతో వచ్చిన మహిళలు సమూహంగా ఏర్పిడి పెద్దమ్మ దేవాలయం వరకు శోభయాత్ర నిర్వహించారు. శోభయాత్రలో పోతరాజుల నృత్యాలు అకటుకున్నాయి. వర్షాలు విరివిగా కురిసి పంటలు బాగా పండి ప్రజలు ఆరోగ్యవంతుగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు పెద్దమ్మకు బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జు జువ్వాడి నర్సింగ రావులు వేరువేరుగా బోనం ఎత్తుకొని అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కాగా బోనాల జాతరతో అయిలపూర్ రోడ్డు పూర్తిగా సందండిగా మారింది. ఈ కార్యక్రమంలో ముదిరాజు సంఘ నాయకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని కొంగు బంగారంగా కొలిచిన వారి కోరికలు తీర్చే పెద్దమ్మతల్లిగా పేరుగాంచిన ఆలయం బోనాల జాతరను ముదిరాజ్‌లు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయంలోని అమ్మవారిని ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకోని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులు భక్తి శ్రద్ధలతో బోనం తయారు చేశారు. బోనంను నెత్తిన ఎత్తుకోని డప్పుచప్పుల మధ్య పెద్ద సంఖ్యలో భక్తులు ఊరేగింపుగా మంగళహారతులతో పెద్దమ్మతల్లి ఆలయంకు బయులు దేరారు. బోనంతో భక్తులు ఆలయం చుట్టు ప్రదిక్షణాలు చేసి సమర్పించుకోని మొక్కలు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కోరుట్ల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావులు బోనం నెత్తిన ఎత్తుకొన్ని భక్తులతో ఊరేగింపులో పాల్గొన్నారు. అమ్మ వారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, ముదిరాజ్ కుల సంఘం సభ్యులు, భక్తులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

● ఘనంగా పోచమ్మ బోనాలు..

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాల జాతర ఘనంగా జరిగింది. గంగపుత్రలు చేప వల, ద్యావతి రాజులు పోతరాజుల విన్యాసాలు డప్పు చపుల్ల మధ్య బోనాల శోభయాత్ర గ్రామస్తులు జరిపారు. గ్రామంలోని పురవీదుల గుండా బోనాల శోభయాత్రను మహిళలు నిర్వహించంగా పోతరాజుల నృత్యాలు అకట్టుకున్నాయి. గ్రామ శివారులోని పోచమ్మ దేవాలయం వరకు మహిళలు బోనాల శోభయాత్ర నిర్వహించి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు విరివిగా కురిసి పంటలు బాగా పండాలని ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం వనబోజన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు గ్రామంలో ఆదివారం అన్నీ కుల సంఘాల ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలతో పాటు వనభోజనాలు చేపట్టారు. అషాడం అరంభం కావడంతో గ్రామంలోని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నీ కుల సంఘాల ఆధ్వర్యంలో ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలతో డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా గ్రామంలోని పోచమ్మ ఆలయానికి వెళ్లి బోనాలతో నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించి ఈ వర్షాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవాలంటూ ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పోచవేని సత్యఎల్లయ్యతో పాటు అన్నీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మెట్‌పల్లిలో బోనాలతో మహిళలు



బోనం సమర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

వైభవంగా జగన్నాథ రథయాత్ర



రథయాత్రలో స్వామి వారి హారతి తీసుకుంటున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి, జూలై, 7: పట్టణంలో హరే రామా హరే కృష్ణ నామశారంతో జగన్నాథ రథయాత్ర వైభవంగా జరిగింది. ఆదివారం పట్టణంలోని కీర్తి ఫంక్షన్ హాల్ వద్ద రథంలో బలరాముడు, సుభద్రదేవి, జగన్నాథ ఉత్సవమూర్తులను ఏర్పాటు చేసిన కృష్ణం వందే జగద్గురుం పెద్దాపూర్ ఇస్కాన్ భక్తులు రథయాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణంలోని అయ్యప్ప టెంపులు మీదుగా పోలీసుస్టేషన్, కొత్తబస్టాడ్, పాత బస్టాండ్, రాజకళమందిర్, ఏఎంసీ మార్కెట్, బస్‌డీపో మీదుగా వెంకట్ రెడ్డి వరకు రథయాత్ర కార్యక్రమాన్ని భక్తులు నిర్వహించారు. పట్టణంలోని పురవీధులన్ని సర్వాంగా సుందరంగా ముస్తాబు చేస్తూ అందమైన ముగ్గులు వేశారు. రథయాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మరె రామా హరే కృష్ణ అంటూ తాడును లాగుతూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పాల్గొని స్వామి వారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించి హారతీ స్వీకరించారు. అనంతరం యాత్రలో పాల్గొని పురవీధులను శుభ్రం చేశారు. అదే విధంగా కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి నర్సింగరావు పాల్గొన్నారు. స్వామి వారి సంకీర్తనం, ప్రవచణం, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య మంగళ హారతిలతో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులతో వారు కలిసి రథయాత్రాన్ని లాగుతూ ముందుకు సాగారు. అనంతరం భక్తుకలు అన్న ప్రసాదం అందజేశారు. యాత్ర విజయవంతంగా జరగడానికి మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, ఇస్కాన్ నిర్వహకులు, తదితరులు పాల్గొన్నారు.



రథయాత్రలో పాల్గొన్న భక్తులు

తాడిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూలై 7: తాటి చెట్టు పై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి గీతా కార్మికుడు పొన్నం దేవరాజ్ గౌడ్ తీవ్ర గాయాల పాలైన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. గ్రామంలోని దేవరాజుగౌడ్ గీతా కార్మిక వృత్తిలో కొనసాగుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజులాగే కల్లు తీసేందుకు గ్రామ శివారులోని తాటి చెట్ల వద్దకు వెళ్లాడు. చెట్టు పైకెక్కి తీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడ్డాడు. అక్కడే ఉన్న పలువురు గీత కార్మికులు తీవ్ర గాయాల పాలైన దేవరాజుగౌడ్‌ను సిరిసిల్ల లోని ఆసుపత్రికి తరలించారు. అతని ఎడమకాలు విరిగిపోయింది. కాగా దేవరాజ్ గౌడ్ కు మెరుగైన వైద్యం అందించడంతోపాటు ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గీతా కార్మిక సంఘం నాయకులు మల్లేష్, సతీష్, కృష్ణ స్వామి ,ఎల్లయ్య, దేవయ్య, ప్రభాకర్ లు కోరారు.

ద్విచక్రవాహనంతో పరారీ.. పట్టుకున్న యువకులు

మల్యాల, జూలై 7: పంట చేల వద్ద నిలిపిన ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తి తీసుకొని పరారీ కావడంతో యువకులు వెంబండించి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మండలంలోని ముత్యంపేటకు చెందిన శ్రీనివాస్‌రావు అనే రైతు మల్యాల క్రాస్ రోడ్డు సమీపంలో పంట చేల వద్ద తన ద్విచక్రవాహనంను నిలుపగా ఓ వ్యక్తి దాన్ని తీసుకొని జగిత్యాల వైపు వెళ్లాడు. మల్యాల క్రాస్ రోడ్డు వద్ద వాహనాన్ని గుర్తుపట్టిన కొందరు యువకులు వెంబడించారు. అయితే అతివేగంతో వెతుతుండడం వల్ల అదుపుతప్పి పడిపోవడంతో నూకపల్లి స్టేజి వద్ద వాహనంతో పాటు సదరు వ్యక్తి పట్టుబడ్డాడు. దీంతో అతన్ని పోలీసులకు అప్పగించారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ ప్రాంత వాసిగా ఆ వ్యక్తి తన వివరాలు తెలిపాడు.

ఎస్సారెస్పీలోకి 2,315 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఆదివారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి 2,315 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 90.323 సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 11.702 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇదిలా ఉండగా జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 5.680 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

వరదకాలువకు మరమ్మతులు కరువు

● కోతలకు గురవుతున్న కాలువ ● బ్రిడ్జిలపై ప్రమాదకరంగా గోతులు ● పొంచి ఉన్న ప్రమాదం.. పట్టని అధికారులు



ముత్యంపేట శివారులో వంతెనపై ప్రమాదకర గోతులు



రామన్నపేట శివారులో కాలువలో వేసిన ఇసుక మేటలు

మల్యాల, జూలై 7: వరదకాలువ మరమ్మతులకు నోచుకోవడం లేదు. కాలువ పక్కల కోతలకు గురవుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. కాలువపై రాకపోకలకు ఏర్పాటు చేసిన బ్రిడ్జిలపై ప్రమాదకరంగా గోతులు ఏర్పడి ప్రమాదాలు జరుగడమే కాకుండా బ్రిడ్జిలకు ప్రమాదం పొంచి ఉన్నా నిర్లక్ష్యం వహించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రాంపూర్ నుంచి సర్వాపూర్ వరకు దాదాపు 10 కిలోమీటర్లకు పైగా వరద కాలువ ఉండగా రామన్నపేట, నూకపల్లి, మల్యాల, ముత్యంపేట, సర్వాపూర్ తదితర గ్రామాల వద్ద కాలువ వర్షపు నీటికి కోతలకు గురైంది. కోతలకు గురి కావడంతో పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. నూకపల్లి శివారులో గతంలో పెద్ద ఎత్తున కోతకు గురి కావడంతో అధికారులు తాత్కలిక మరమ్మతులు చేపట్టినప్పటికీ మిగితా చోట్ల ఎలాంటి మరమ్మతులు చేయలేదు. దీంతో రామన్నపేట, మల్యాల శివారులో కోతలకు గురైన చోట కాలువలో ఇసుక కుప్పలు ఏర్పడ్డాయి. కాగ వర్షాకాలంలో నూకపల్లి శివారులో గ్రామం పక్కనే కాలువ ఉండడంతో గ్రామంలోని నీరు కాలువలోకి వెళ్లడం, కాలువ పొంగడంతో గ్రామస్థులు ప్రతి ఏటా బిక్కుబిక్కుమంటున్నారు. అయిన అక్కడ కాలువను పూడ్చివేసే చర్యలు తీసుకోకపోవడంతో గ్రామస్థులు మండిపడుతున్నారు.

● బ్రిడ్జిలపై ప్రమాదకర గోతులు..

వరదకాలుపై గత బ్రిడ్జిలపై ప్రమాదకరంగా గోతులు ఏర్పడ్డాయి. రామన్నపేట, మల్యాల, ముత్యంపేట, సర్వాపూర్ గ్రామాల వద్ద కాలువ వంతెనల వద్ద ప్రమాదకరంగా గోతులు ఏర్పడ్డాయి. వర్షపు నీరు వెళ్లకుండా వ్యర్థాలు నిండిపోవడంతో వంతెనపైనే నీరు నిలుస్తున్నాయి. దీంతో వంతెనపై గోతులు ఏర్పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కనీస మరమ్మతులు చేయకపోవడం, బ్రిడ్జిలపై కంకర, స్టీలు తేలి ద్విచక్రవాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మరమ్మతు చర్యలు చేపట్టాలని ప్రజాప్రతినిధులు కూడా చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

వేములవాడ నుంచి అరుణాచల క్షేత్రానికి లగ్జరీ బస్సు

భగత్‌నగర్, జూలై 7: వేములవాడ నుంచి తమిళనాడులోని అరుణాచల క్షేత్రానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు కరీంనగర్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎన్.సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21న గురుపౌర్ణమిని పురస్కరించుకొని 19వ తేదీ రాత్రి 8 గంటలకు వేములవాడలో బయలుదేరిన బస్సు 9 గంటలకు కరీంనగర్ చేరుకుంటుందన్నారు. కరీంనగర్ నుంచి అరుణాచల క్షేత్రానికి వెళ్లే దారిలో కాణిపాకం వరసిద్ధి వినాయక దేవస్థానం, తమిళనాడులోని వేలూర్ శ్రీ మహాలక్ష్మి టెంపులు గోల్డెన్ టెంపుల్ దర్శనం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. 20న శనివారం రాత్రి అరుణాచల క్షేత్రానికి చేరుకుంటుందన్నారు. అరుణాచల గిరి ప్రదక్షిన దర్శనం అనంతరం 21న సాయంత్రం 5 గంటలకు బయలుదేరి తిరుగు ప్రయాణంలో గద్వాల అలంపూర్‌లోని జోగు లాంబ దేవస్థానం మీదుగా 22వ తేదీ ఈసాయంత్రం 6 గంటలకు కరీంనగర్ నుంచి వేములవాడ చేరుతుందన్నారు. ఈ ప్రత్యేక బస్సులో పెద్దలకు 4,500 రూపాయలు, పిల్లలకు 3800 రూపాయల ఛార్జీలు వసూలు చేస్తారన్నారు. ముందస్తు రిజర్వేషన్ కోసం ఆర్టీసీ వెబ్‌సైట్‌లో సర్వీసు నంబర్ 75555ను ఎంపిక చేసుకుని ముందస్తు రిజర్వేషన్ చేసుకోవాలన్నారు.

అలుగునూర్‌లో దొంగల బీభత్సం

- ఓ ఇంట్లో, ఆలయంలో దొంగతనం
- బంగారం, నగదు అపహరణ



ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీం

తిమ్మాపూర్, జూలై 7: మండలంలోని అలుగునూర్‌లో దొంగలు బీభత్సం సృష్టించారు. రాజీవ్ రహదారికి సమీపంలో ఉన్న ఓ ఇంట్లో, ఎల్లమ్మ ఆలయంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అలుగునూర్‌లోని సింగిరెడ్డి అనంతరెడ్డి ఆదివారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కి వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళంతో పాటు ఇంట్లో ఉన్న బీరువ పగలగొట్టి ఉన్నట్లు గమనించి ఎల్ఎండీ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ ఎస్సై చేరాలు, క్లూస్ టీం సహకారంతో దర్యాప్తు చేశారు. ఇంట్లో నుంచి ఐదు తులాల బంగారం, 23వేల నగదు చోరీకి గురైంది. అదేవిధంగా అలుగునూర్‌లోని ఎల్లమ్మ ఆలయంలో అర్ధరాత్రి ఓ దొంగ ఆలయంలోకి చొరబడి దొంగతనానికి పాల్పడ్డట్టు గుర్తించారు. ఆలయం ద్వారాలు తాళాలు పగళగొట్టి ఉండటంతో అనుమానం రాగా లోనికి వెళ్లి పరిశీలించగా ఆలయంలో ఉండే హుండీని పగల గొట్టి ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. దొంగతానానికి సంబంధించి సీసీ ఫుటేజ్‌లో ఒక వ్యక్తి ఆలయం తాళాలు పగలగొట్టి ఆలయంలోకి ప్రవేశించి దొంగతనానికి పాల్పడ్డట్లు గుర్తించారు. ఆలయంలో మూడు గ్రాముల బంగారం, ఐదు వేల రూపాయలు చోరీ జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు ఎల్ఎండీ ఎస్సై చేరాలు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కొండగట్టులో కోరుట్ల వాసి ఆత్మహత్యాయత్నం

మల్యాల, జూలై 7: దిగువ కొండగట్టులోని బస్‌స్టాండ్ వద్ద కోరుట్లకు చెందిన ఓ వ్యక్తి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా స్థానిక నాయకులు 108, పోలీసులకు సమాచారం అందించడంతో పాటు ఆసుపత్రికి తరలించారు. కోరుట్ల ప్రకాష్ నగర్‌కు చెందిన వాసాల వేణు అనే వ్యక్తి క్రిమిసంహారక మందు తాగి పడిపోయి వాంతులు చేసుకుంటున్నాడు. మాజీ ఎంపీపీ దారం ఆదిరెడ్డి, స్థానికులు గమనించి డయల్ 100, 108కు సమాచారం అందించారు. దీంతో బ్లూకోల్ట్స్ పోలీసులు సంపత్ అక్కడకు చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. అతన్ని చికిత్స కోసం అంబులెన్స్‌లో జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నట్లు తెలిసింది.

బాలుడిని కొట్టిన ఆయాకు మెమో జారీ

కథలాపూర్, జూలై 7 : మండలంలోని బొమ్మెనలో అంగన్‌వాడీ కేంద్రంలో శ్రీనాథ్ అనే బాలుడిని చెంపపై కొట్టిన ఘటనలో ఆయా రాజనర్సుకు మెమో జారీ చేసినట్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక తెలిపారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించి ఆలనా, పాలనా చూసుకోవాల్సిన ఆయా బాలుడిని కొట్టి తీవ్రంగా గాయపరిచినట్టు ఐసీడీఎస్ అధికారులతో పాటు తహసీల్దార్, ఎంపీడీఓ, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు బాధితుని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దీంతో మెట్‌పల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ తిరుమలాదేవి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఈ సంఘటనపై ఆయాకు మెమో జారీ చేసి వాంగ్మూలం కోరినట్టు తెలిపారు.

డబ్బులు తీసుకొని పారిపోయిన డ్రైవర్ అరెస్టు



డ్రైవర్ అరెస్టును చూపుతున్న పోలీసులు

జగిత్యాల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): యజమానికి మోసం చేసి డబ్బులతో పారిపోయిన డ్రైవర్‌ను జగిత్యాల పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో సీఐ వేణుగోపాల్ అరెస్టు వివరాలను వెల్లడించారు. హైదరాబాద్ నగరానికి చెందిన ఛైల్ సింగ్ తెలంగాణ ప్రాంతానికి ఫైర్బోస్ ఎలక్ట్రికల్ కంపెనీకి డిస్ట్రిబ్యూటర్‌గా ఉన్నాడు. తన కంపెనీ లావాదేవీలకు సంబంధించిన విషయంలో ఛైల్ సింగ్ స్వయంగా వెళ్లి కలెక్షన్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రాజస్థాన్ ప్రాంతానికి చెందిన దయరాం సింగ్‌ను ఏడాది క్రితం తన కారు డ్రైవర్‌గా ఛైల్ సింగ్ నియమించుకుని వ్యాపారం చేస్తున్నాడు. గత నెల 26వ తేదీన ఛైల్ సింగ్ నిజామాబాద్, ఆదిలాబాద్ తదితర పట్టణాల్లో తన కంపెనీకి సంబంధించిన కలెక్షన్ చేసుకుని జగిత్యాలకు చేరుకున్నారు. కారును యావర్ రోడ్డులోని పార్క్ వద్ద పార్కింగ్ చేసి ఛైల్ సింగ్ కలెక్షన్ కోసం వెళ్లి తిరిగి వచ్చేసరికి కారులో ఉన్న డ్రైవర్ దయరాం సింగ్ కనబడలేదు. కలెక్షన్ చేసిన రూ. 15 లక్షల నగదుతో తన డ్రైవర్ దయారాం సింగ్ తనను మోసం చేసి ఉడాయించాడని పోలీసులకు ఫిర్యాదు చేయగా జగిత్యాల టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఆదివారం జగిత్యాల బస్టాండులో గాలింపులు జరుపుతుండగా అనుమానాస్పదంగా దయారాం పట్టుబడ్డాడు. అతని వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా రూ. 12.10 లక్షలు నగదు, రెండు బిల్ బుక్స్ ఉన్నట్లుగా గుర్తించారు. నగదును స్వాధీనం చేసుకొని, దయారాంను అరెస్టు చేసినట్లు పోలీసులు వివరించారు.

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం.. మెట్‌పల్లి యువకుడి మృతి



బాసని వంశీ(ఫైల్)

మెట్‌పల్లి, జూలై, 7: మెట్‌పల్లి పట్టణానికి చెందిన బాసని వంశీ(20) అను యువకుడు హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు స్నేహితులు ఆదివారం తెలిపారు. పట్టణానికి చెందిన బాసని రవి, లక్ష్మి దంపతుల కుమారుడు హైదరాబాద్‌లోని ప్రైవేట్ కళాశాలలో బీటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. శనివారం రాత్రి బాలు అను మిత్రునితో కలిసి ద్విచక్ర వాహనంపై అమీర్‌పేట నుంచి మెహిదీపట్నంకు బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపుతప్పి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నగా బాసని వంశీ అక్కడికక్కడే మృతి చెందగా బాలు గాయాలపాలైనాడు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడాని తెలియడంతో కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి.

నిర్మించారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు

- మినీట్యాంక్ బండ్‌కు నిర్వహణ కరువు

చొప్పదండి, జూలై 7: నియోజకవర్గానికి ఒక మినిట్యాంక్ బండ్‌ను నిర్మించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా చొప్పదండిలో కోట్లాది రూపాయలతో చేపట్టిన మినిట్యాంక్ బండ్ నిర్లక్ష్యానికి గురవుతోంది. 2017లో రాష్ట్రప్రభుత్వం చొప్పదండి నియోజకవర్గ కేంద్రానికి ఒక మినీట్యాంక్ బండ్‌ను మంజూరు చేసింది. చొప్పదండి నియోజకవర్గ కేంద్రంలో నిర్మించాల్సిన మినీట్యాంక్‌బండ్‌ను రేవెల్లిలో పనులు చేపట్టారు. మిషన్ కాకతీయలో భాగంగా చెరువును మినీట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దారు. రాజకీయ కారణాల కారణంగా నియోజకవర్గ కేంద్రమైన చొప్పదండిలోని కుడి చెరువును కాదని రెవెల్లి పెద్ద చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా ప్రకటించి అభివృద్ధి చేశారు. మండలంలోని రెవెల్లిలో పెద్ద చెరువును 2017లో ఆరు కోట్ల 55 లక్షలతో మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేశారు. ఈ నిధులతో చెరువులోని పూడిక మట్టిని తొలగించి కట్టను బలపరిచారు. కట్టపై రెయిలింగ్, ఫుట్‌పాత్, వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేశారు. పెద్ద చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దారు. ఆ తర్వాత నిర్వాహణ మరిచారు. ప్రస్తుతం మినీ ట్యాంక్ బండ్ రూపు కోల్పోయింది. రెయిలింగ్ మొత్తం తుప్పు పట్టిపోగా, వాకింగ్ ట్రాక్ పగుళ్లు ఏర్పడ్డాయి. పిచ్చిమొక్కలు పెరిగి నడవలేని పరిస్థితి ఏర్పడింది. చెరువు కట్ట వర్షాలకు కోతకు గురికాగా ఆరేళ్లుగా ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. మినీట్యాంక్ బండ్‌పై ఎలాంటి ఆహ్లాదకరమైన వాతావరణం లేకపోగా చెరువుకట్ట సైతం బలహీనపడుతోంది. మినీ ట్యాంక్‌బండ్‌పై లైటింగ్, చిన్నారులకు ఆట వస్తువులు ఏర్పాటు చేయాల్సి ఉండగా నిధులు సరిపోక ఏర్పాటు చేయలేదు. రాత్రిపూట మాత్రం మినీ ట్యాంక్ బండ్ మందుబాబులకు అడ్డాగా మారిందని గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మినీ ట్యాంక్‌బండ్‌కు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెరువుకట్టను మరమ్మతు చేసి అభివృద్ధి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



నిరుపయోగంగా మారిన ట్రాక్



కోతకు గురవుతున్న చెరువు కట్ట

ఎల్‌వోసీల అందజేత

ఎలిగేడు, జూలై 7 : మండలంలోని శివపల్లిలో ఆదివారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు రూ.3.25,000 ఎల్‌వోసీలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఓదెల మండలం హరిపురం గ్రామానికి చెందిన లక్ష్మణ్, కొలనూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డిలు వివిధ అనారోగ్య కారణాలతో నిమ్స్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న తరుణంలో ఎల్‌వోసీలను అందించి ఆదుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

నిరుపేద కుటుంబానికి సహాయం

కాల్వశ్రీరాంపూర్, జూలై 7: మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన తూండ్ల రమేష్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. రమేష్ ఒక ప్రైవేట్ సంస్థలో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ మరణించాడు. బాధిత కుటుంబ గమనించిన ఊషన్నపల్లి ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య ఆదివారం మృతుడు రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.2వేల విలువైన బియ్యం, ఇతర నిత్యావసర సరకులను వారికి అందజేశారు.

నిరుపేదలకు అమృత కలశం పంపిణీ

కమాన్‌పూర్, జూలై 7 : మండలంలోని పలు గ్రామాల్లో శ్రీసత్యసాయి సేవాదళ్, కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ సభ్యులు ఆదివారం 15 మంది నిరుపేద ప్రజలకు కలశం పేరిట బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవాదళ్ జిల్లా ప్రతినిధి నూక రమేష్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి, కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్ లయన్ తదితరులు ఉన్నారు.

టీడీపీ సమావేశానికి తరలిన నాయకులు

కళ్యాణ్‌నగర్, జూలై 7: తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు హైదరాబాద్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆదివారం గోదావరిఖని నుంచి టీడీపీ రామగుండం ఇన్‌చార్జి పెద్దపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణలో తెలుగుదేశం బలోపేతానికి కార్యాచరణ, విధివిధానాలపై ఈ సమావేశంలో చంద్రబాబునాయుడు చర్చించారని ఆయన చెప్పారు. హైదరాబాద్‌కు తరలివెళ్లినవారిలో కోటగిరి పాపయ్య, సంగెపు రాజు, వాజిద్, గుండబోయిన ఓదెలు, మల్లయ్య ఉన్నారు.

'అధికారం శాశ్వతం కాదు'

కమాన్‌పూర్, జూలై 7: ప్రజాస్వామ్య దేశంలో అధికారం ఎన్నటికి శాశ్వతం కాదని, ప్రజలు సరైన సమయంలో తీర్పు ఇచ్చే బుద్ధి చెబుతారని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పుట్ట మధు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బీఆర్ఎస్‌లో కొనసాగుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులతో తనకు ప్రాణ హానీ ఉందని చెప్పి.. నేడు కాంగ్రెస్ పార్టీలో చేరి కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులకు వత్తాసు పలుకుతూ పుట్ట మధుపై అసత్య ఆరోపణలు చేయటం దిగుజారుడు రాజకీయాలకు అద్దం పడుతుందన్నారు. విలువలతో కూడిన రాజకీయ ప్రజాప్రతినిధులకు ప్రజల గుండెల్లో పదిలమైన స్థానం ఉంటుందని, అది గ్రహించి ప్రవర్తించాలని హితవు పలికారు. సమావేశంలో మండల యూత్ అధ్యక్షుడు బొమ్మగాని అనిల్‌గౌడ్, మాజీ ఏఎంసీ వైస్ ఛైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, మండల మహిళా అధ్యక్షురాలు పొన్నం రాజేశ్వరి, సిద్దిపల్లి మాజీ సర్పంచ్ తాటికొండ శంకర్, జూలపల్లి మాజీ ఉపసర్పంచ్ పోలుదాసరి సాయికుమార్, నాయకులు నీలం శ్రీను, ఎలబోయిన రామ్మూర్తి ఉన్నారు.

మూడేళ్లు దాటినా పూర్తి కాని బీటీ రోడ్డు

- దూర భారం తగ్గించేందుకు కొత్త రోడ్డు - 5.23 కి.మీ రోడ్డుకు రూ 3.21 కోట్ల నిధులు

- నత్తనడకన రోడ్డు పనులు - పట్టించుకోని అధికారులు


రోడ్డు నిర్మాణం కోసం సర్వే చేస్తున్న అధికారులు(ఫైల్)


కంకరతో నిలిచిన రోడ్డు పనులు

సుల్తానాబాద్, జూలై 7 : ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్న కారణంతో మూడేళ్ల కిందట చేపట్టిన రోడ్డు పనులు ఇప్పటికీ పూర్తికావడంలేదు. నత్తనడకన సాగుతున్న ఈ పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల రేగడిమద్దికుంట గ్రామాలను కలుపుతూ సుల్తానాబాద్ పట్టణం నుంచి రోడ్డు నిర్మాణం కోసం గతంలోనే ప్రతిపాదనలు ఉన్నాయి. కానీ రోడ్డు పనులు చేపట్టేందుకు 2021లో మోక్షం లభించింది. సుల్తానాబాద్ మాలకుంట నుంచి సుద్దాల పాత బండ్ల బాట రోడ్డును బీటీ రోడ్డుగా మార్చి, దీన్ని సుల్తానాబాద్‌కు బైపాస్‌గా మార్చాలన్న ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం 2020-21 ప్రధాన మంత్రి సడక్ యోజన పథకం కింద తారు రోడ్డు నిర్మాణం కోసం 3 కోట్ల 21 లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో ఐదు కిలోమీటర్ల మేరకు రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది. 20 జూలై 2021 రోజున ఈ రోడ్డు పనులు ప్రారంభించారు. మూడు సంవత్సరాలు కావస్తున్నా కూడా పనులు కొలిక్కి రాలేదు. ఓ ఏడాది రోడ్డు వెడల్పు చేయడం, మరో ఏడాది మట్టి పోయడం, మరో ఏడాది కంకర పోయడం వంటి పనులు చేశారు. ప్రతీ వర్షాకాలంలో ప్రజలు ఈ దారిలో నడవాలన్నా, వాహనాలు వెళ్లాలన్నా నరకయాతన పడ్డారు. పనులు నత్తనడకన సాగుతుండడంతో పాటు పనులను పర్యవేక్షించే వారు లేకపోవడం వలన నాసిరకంగా వర్షాలలో పనులు చేయడం వలన రోడ్డు నాణ్యత దెబ్బతింటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ రోడ్డు పనులను 19 జనవరి 2023లో గా కంట్రాక్టర్ పూర్తి చేయాల్సి ఉందని అధికారులు రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన బోర్డులో కూడా పేర్కొన్నారు. ఆ గడువు పూర్తి అయి ఏడాదిన్నర కావస్తోంది. అయినా గుత్తేదారుపై అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

బైపాస్‌గా మారనున్న రోడ్డు..

ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఈ రోడ్డు పూర్తయితే కాల్వశ్రీరాంపూర్, ఓదెల, జమ్మికుంట, హన్మకొండ లాంటి ప్రాంతాల నుంచి వచ్చే లారీలు ఇతర వాహనాలు రైల్వేస్టేషన్ నుంచి సుల్తానాబాద్ పట్టణంలోకి రానవసం ఉండదు. సుద్దాల నుంచే బైపాస్‌గా ఈ రోడ్డు ఉపయోగపడుతుంది. సుద్దాల సుల్తానాబాద్ పోచమ్మ దేవాలయం మీదుగా పెద్దపల్లి రాజీవ్ రహదారికి చేరుతుంది. అక్కడి నుంచి పెద్దపల్లికి కరీంనగర్‌కు వెళ్లడం సులభం. అంతేకాకుండా గతంలో ఐదారు దశాబ్దాల కిందట సుద్దాల రేగడిమద్దికుంట తదితర గ్రామాల ప్రజలు నిత్య అవసరాలకు సుల్తానాబాద్ రావడానికి ఈ రోడ్డు మాత్రమే అందుబాటులో ఉండేది. ఇంతటి ప్రాధాన్యంఉన్న ఈ రోడ్డు పనులు పూర్తి చేయడంలోగల నిర్లక్ష్యం గురించి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని వెంటనే పనులు పూర్తి చేయించాలని కోరుతున్నారు.

పేద విద్యార్థుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

- వసతి గృహ భవన నిర్మాణ భూమి పూజలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీటౌన్, జూలై 7: పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి, వారి సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. ఆదివారం రామగుండం కార్పొరేషన్‌లోని 48వ డివిజన్‌లో పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఎన్‌టీపీసీ సీఎస్ఆర్ నిధులు రూ.2 కోట్లతో సాంఘీక సంక్షేమ వసతి గృహ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహభవన నిర్మాణ పనుల విషయంలో ఎక్కడ రాజీ పడకుండా నాణ్యత ప్రమాణాలతో నిర్మాణాన్ని పూర్తిచేయాలని కాంట్రాక్టర్, సంబంధిత అధికారులకు సూచించారు. కమిషన్లకు ఆశపడి నాసిరక నిర్మాణ పనులు చేపడితే తప్పకుండా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతికి చోటు లేదని, ప్రతిఒక్కరూ అంకిత భావంతో పని చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో మేయర్ బంగి అనిల్‌కుమార్, కార్పొరేటర్లు లక్ష్మణ్‌గౌడ్, మహంకాళిస్వామి, ముస్తఫా, కాంగ్రెస్ నాయకులు సతీష్, శివ, మోబిన్ తదితరులు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

సంస్కృతిని పరిరక్షించాలి

-ఎమ్మెల్యే విజయరమణారావు


బోనంతో తరలివెళ్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల, జూలై 7: గ్రామీణ ప్రాంతాల్లో సంస్కృతిని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని కుర్మ కులస్థులకు ఆరాధ్యదైవమైన బీరప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ఎమ్మెల్యే విజయరమణారావు ఆదివారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం మహిళలతో బోనాలు ఎత్తుకొని గ్రామం నుంచి తరలివెళ్లి బీరప్ప స్వామికి సమర్పించారు. కార్యక్రమంలో బీరప్ప స్వామి ఉత్సవ కమిటీ నాయకులు, యువకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం

సుల్తానాబాద్, జూలై 7: ఏకలవ్య సంస్థ దత్తత విద్యార్థిని కాదాసి హర్షితకు ఆ సంస్థ వ్యవస్థాపకులు మానుపాటి రాజయ్య ఆరువేల రూపాయల చెక్కును అందజేశారు. సుల్తానాబాద్ మండలం నీరుకుళ్ల గ్రామానికి చెందిన హర్షిత ఎంబీబీఎస్ చదువుతోంది. నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో ఏడాది క్రితం ఏకలవ్య సంస్థ వారు దత్తత తీసుకుని ఎంబీబీఎస్ పూర్తయ్యేంత వరకు ఏడాదికి ఆరువేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగా ఆదివారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హర్షితకు చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోటగిరి విజేందర్, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మానుపాటి రాజయ్య, ప్రధాన కార్యదర్శి మొగిలి శ్రీనివాస్, బిజిలి సమ్మయ్య, దాసరి సతీష్, బూర్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అఖిల భారత యాదవ మహాసభ కార్యవర్గం

మంథని, జూలై7: అఖిల భారత యాదవ మహాసభ నూతన కార్యవర్గాన్ని స్థానిక ఎస్ఎస్‌బీ గార్డెన్‌లో జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సందేవేణ రాజేందర్, జిల్లా కార్యదర్శి ఉడత పర్వతాలు యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పర్శవేన మోహన్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పేగడ శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షులుగా కనగంటి ఓదెలు యాదవ్, వేముల లచ్చన్న యాదవ్, జనరల్ సెక్రటరీగా బాస అశోక్ యాదవ్, జాయింట్ సెక్రటరీగా రాజనవేన సదయ్య యాదవ్, సెక్రటరీగా ఎలవేణి సమ్మయ్య, యూత్ అధ్యక్షుడిగా పిడుగు మల్లేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ దొరగోర్ల రవీందర్, ఉపాధ్యక్షునిగా పంచిక హర్ష వర్ధన్, జాయింట్ సెక్రెట్రిగా బురుగుల రాకేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ దరవేని నరసింహ యాదవ్, నాయకులు తోట్ల తిరుపతి యాదవ్, పర్శ బక్కన్న యాదవ్, మాజీ సర్పంచ్‌లు కనవెన శ్రీనివాస్ యాదవ్, కనవెన కొమురయ్య యాదవ్, కట్టికొల్ల సదానందం, కవాటి సమ్మయ్య, పెరవేని లింగయ్య, అమ్మకూటి మల్లేష్, మామిడి దేవేందలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న శ్రీరామ విద్యాలయం విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, జూలై7: గోదావరిఖని విద్యానగర్‌లోని శ్రీరామ విద్యాలయం 1997-98 బ్యాచ్‌కు చెందిన పదవతరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 26 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. చదువు చెప్పిన గురువులను సన్మానించి జ్ఞాపికలను బహుకరించారు. మరణించిన పాఠశాల కరస్పాండెంట్ పిట్టల రాజేందర్, ఉపాధ్యాయులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కె.చంద్రశేఖర్, సుమన్, రంగు శ్రీనివాస్, బిరెడ్డి మధు, తోకల రమేష్, జెర్మియా, యుగేందర్, లావణ్య, జ్యోతి, సిహెచ్ స్వరూప, మల్లేష్, సత్యనారాయణ, రాజేందర్, రాజ్‌కుమార్, శ్యామ్, కిషోర్ పాల్గొన్నారు.

మైసమ్మకు బోనాలు సమర్పించిన ఎమ్మెల్యే దంపతులు


మైసమ్మకు మొక్కుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ దంపతులు

కళ్యాణ్‌నగర్, జూలై7: ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందున్న మైసమ్మతల్లికి ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, మనాలీ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారు నియోజకవర్గం ప్రజలను చల్లగా చూడాలని ఆకాంక్షించారు.

మాజీ ఎంపీపీకి సన్మానం


మాజీ ఎంపీపీ సంపత్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

కాల్వశ్రీరాంపూర్, జూలై 7: మండలంలోని మంగపేట గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ నూనేటి సంపత్‌ను మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆదివారం పెద్దపెల్లిలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలో చురుకుగా పనిచేసే ఎంపీపీగా ఐదు సంవత్సరాలు కాల్వశ్రీరాంపూర్ మండల ప్రజలకు సేవలందించి మంచిపేరు తెచ్చుకున్నాడన్నారు. నూనేటి సంపత్ రాబోయే రోజుల్లో మరిన్ని గొప్ప పదవులు పొందాలని అన్నారు.

రామగిరిలో..

రామగిరి, జూలై 7:మండలంలోని రామయ్యపల్లి గ్రామంలో తాజా మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్కను ఆదివారం గ్రామస్తులు సత్కరించారు. దాడి కృష్ణ, పెంద్రు ప్రదీప్‌రెడ్డి, రజినీకాంత్, సతీష్, హరీష్, మహేష్, సాయికుమార్‌లతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్ ప్రెస్ క్లబ్ కార్యవర్గం

కమాన్‌పూర్, జూలై 7 : కమాన్‌పూర్ ప్రెస్‌క్లబ్ కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా బండ సాయిశంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా మల్యాల సురేష్‌గౌడ్, కోశాధికారిగా గాదె బాలయ్య, కార్యవర్గ సభ్యులుగా ఎండీ జబ్బార్‌ఖాన్, దండే కృష్ణ, ఆరేపల్లి శంకర్, పొన్నం నవీన్‌కుమార్‌లు ఎన్నికయ్యారు.



సంస్థ అభివృద్ధికి తోడ్పాటునివ్వని కాంగ్రెస్ ప్రభుత్వం

- కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ కేంద్ర ఉపాధ్యక్షుడు సారగంపాణి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎంఎస్ నాయకులు

ఫైటింక్లయిన్‌కాలనీ, జూలై 7: సింగరేణి సంస్థకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎటువంటి తోడ్పాటును అందించడం లేదని బీంఎస్ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ కేంద్ర ఉపాధ్యక్షుడు సారగంపాణి అన్నారు. ఆదివారం ప్రెస్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ వడ్డెపల్లి కుమారస్వామితో కలిసి మాట్లాడారు. బకాయిల రూపంలో వేల కోట్ల బకాయిలు సింగరేణికి రావాల్సి ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. దేశంలో బొగ్గు బ్లాక్‌ల కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు వేలం ప్రక్రియను కేంద్రం నిర్వహిస్తున్నట్టు సారంగపాణి పేర్కొన్నారు. సింగరేణికి రావాల్సిన బకాయిలతో వేలంలో పాల్గొంటే మూడు గనులు దక్కే అవకాశం ఉన్నదన్నారు. టీబీజీకేఎస్ తీరుగాను ప్రస్తుత గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు నడుచుకుంటున్నాయని, కార్మిక సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని అన్నారు. కొన్ని పార్టీలు, సంస్థలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం సింగరేణి భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నారని అన్నారు. వేలంలో పాల్గొనడం ద్వారానే గనులు దక్కే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. ఈనెల 14న శ్రీరాంపూర్‌లో యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని, దీనికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హాజరుకానున్నట్టు తెలిపారు. దేశంలోని కోల్‌సెక్టార్‌తో పాటు సింగరేణిలో జరుగుతున్న పరిణామాలు, కార్మికుల సమస్యలపై చర్చించి తీర్మానాలు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈవిలేకరుల సమావేశంలో వేణుగోపాల్‌రావు, అర్కుల ప్రసాద్, వెంకటస్వామి, జనార్థన్, రాజేశ్వరరావు, శివాజీ, సురేష్, లింగంనాయక్, శ్యాం, రమేష్, కోటేష్ పాల్గొన్నారు.

వొకేషనల్ కోర్సు ఫ్యాకల్టీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఫైటింక్లయిన్‌కాలనీ, జూలై 7: సింగరేణి ఆర్జీ-2 సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే వృత్తి విద్యాకోర్సులకు ఫ్యాకల్టీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 సంవత్సరానికి టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులలో జరిగే శిక్షణకు ఆయా కోర్సుల్లో అర్హులు దరఖాస్తు చేసకోవాలని సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తులతో పాటు విద్యార్హత, సంబంధిత కోర్సులో అనుభవం సర్టిఫికేట్లతో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్ పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో ఈనెల 15వ తేదీలోపు పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో అందజేయాలని జీఎం ప్రకటనలో పేర్కొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

శ్రీరాంపూర్, జూలై 7: సింగరేణి కోల్‌మైన్స్ కార్మికసంఘ్(బీఎంఎస్) 28వ ద్వైవార్షిక మహాసభలు ఈనెల 14న శ్రీరాంపూర్ ఏరియా సీఈఆర్‌క్లబ్‌లో నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి తెలిపారు. మహాసభల పోస్టర్లను ఆదివారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ కార్మికుల డిమాండ్లను మహాసభల్లో చర్చించి వాటి అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సింగరేణి యాజమాన్యాన్ని కోరతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాగం రాజేందర్, గూడ శ్రీకాంత్, జెల్ల తిరుపతి, కట్కూరి సతీష్, దొంతుల రాజేంద్ర ప్రసాద్, గోనె రామకృష్ణ, అడిగొప్పుల రాజకుమార్, కుంట రాజు, పోతరాజు రాజేందర్, ఆసరి విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: సింగరేణిలో యూనియన్ బలోపేతానికి కృషిచేయాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. ఆదివారం యూనియన్ కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల14న శ్రీరాంపూర్ ఏరియాలో జరిగే యూనియన్ మహాసభలను జయప్రదం చేయాలనికోరారు.

బొగ్గు బ్లాకుల వేలానికి వ్యతిరేకంగా పోరాటాలు..

- ఐఎన్‌టీయూసీ కోర్ కమిటీలో జనక్ ప్రసాద్

గోదావరిఖని, జూలై 7: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న బొగ్గు గనుల వేలంకు వ్యతిరేకంగా సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టేందుకు సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్(ఐఎన్‌టీయూసీ) సిద్ధమవుతున్నది. మన బొగ్గు, మన హక్కు అనే నినాదంతో కోల్‌బెల్ట్ అంతా భారీ పోరాటాలు నిర్వహించేందుకు క్యాడర్‌ను సిద్ధం చేస్తున్నది. సింగరేణి పరిరక్షణ రణభేరి యాత్ర పేర ఆందోళనలు చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నది. ఆదివారం ఎన్‌టీపీసీ పరిధిలోని ఒక ప్రైవేట్‌ఫంక్షన్ హాల్‌లో ఐఎన్‌టీయూసీ కోర్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ సింగరేణిపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బొగ్గు గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూనే సింగరేణిలో కార్మికుల హక్కుల పరిరక్షణ,సౌకర్యాల కోసం కూడా ఈ రణభేరి యాత్రలో యాజమాన్యంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు. బొగ్గు గనుల్లో జరుగుతున్న ప్రమాదాలు, వాటి నివారణ కోసం తీసుకోవాల్సిన సేఫ్టీ నిర్ణయాలను కూడా ఈ యాత్ర సందర్భంగా ఐఎన్‌టీయూసీ ప్రస్తావిస్తుందన్నారు. సింగరేణిలోని కాంట్రాక్టు కార్మికుల కోసం ఐఎన్‌టీయూసీకి అనుబంధంగా కూడా సింగరేణి కాంట్రాక్టు యూనియన్‌ను ప్రారంభించి వాళ్ల హక్కుల కోసం పోరాడేందుకు ఈ కోర్ కమిటీ నిర్ణయం తీసుకున్నది. ఐఎన్‌టీయూసీని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా ఈ కోర్ కమిటీలో చర్చించారు. ఈ కోర్ కమిటీ సమావేశంలో కేంద్ర ఉపాధ్యక్షులు నర్సింహారెడ్డి, సిద్ధంశెట్టి రాజమౌళి, ధర్మపురి, జనరల్ సెక్రటరీలుగా త్యాగరాజన్, అక్రం, క్యాంపెనింగ్ ఇన్‌చార్జి వికాస్ కుమార్, కేంద్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేందర్, మహిళా అధ్యక్షురాలు శేషారత్నం, జిల్లా అధ్యక్షుడు దాస్, ఫెడరేషన్ నాయకులు భీంరావు, ఉపాధ్యక్షులు అక్బర్ అలీ, కలవేన శ్యాం, గరిక స్వామి, పేరం రమేష్, నాయకులు ఆరెపల్లి శ్రీనివాస్, ఆల్బర్ట్, మహబూబ్, జీ సత్యనారాయణ, పోచయ్య, పుల్లూరి లక్ష్మణ్, రఘుపతిరెడ్డి, సదానందం, కొత్త సత్యనారాయణరెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, భోగ బుచ్చయ్య, దేవి భూమయ్య, జెట్టి శంకర్‌రావు, రజాక్, వెంకటేశ్వర్లు, పీతాంబరం పాల్గొన్నారు.

ఎల్లో, రెడ్ కార్డులను రద్దు చేయాలి : ఏఐటీయూసీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మడ్డి ఎల్లయ్య

గోదావరిఖని, జూలై 7: సింగరేణిలో పని చేస్తున్న కార్మికులకు పని స్థలాల్లో ప్రమాదం జరిగితే ఎల్లో, రెడ్ కార్డులుజారీ చేస్తామంటూ యాజమాన్యం భయభ్రాంతులకు గురి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లయ్య, కేంద్ర కార్యదర్శి కవ్వంపెల్లి స్వామి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం కార్మికులను ఇబ్బందులకు గురి చేసేందుకు నల్ల చట్టాలను తయారు చేస్తుందని వారు ఆరోపించారు. ఎల్లో, రెడ్ కార్డులనుజారీచేస్తూ భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని, కార్మిక సంఘాలతో చర్చించకుండా నూతన కార్డుల విధానం ప్రవేశపెట్టడం దుర్మార్గమైన చర్య అని ఆరోపించారు. ఒక్కసారి ప్రమాదానికి కారకులైతే ఎల్లో కార్డు, మూడు సార్లు ప్రమాదానికి కారకులైతే రెడ్ కార్డులను జారీ చేస్తారని, దీని వల్ల కార్మికులు తీవ్ర మానసిక ఒత్తిడి గురయ్యే అవకాశం ఉందన్నారు. యాజమాన్యం ఎల్లో, రెడ్ కార్డులను తక్షణమే రద్దు చేయాలని, లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నూతన బొగ్గు బ్లాకులను వేలంవేయడాన్ని నిరసిస్తూ ఈనెల 8 నుంచి 12వరకు సింగరేణి వ్యాప్తంగా అన్ని జీఎం కార్యాలయాల వద్ద నిరసన దీక్షలు చేయనున్నట్టు చెప్పారు. విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు ఆరెల్లి పోషం, సంకె అశోక్, రంగు శ్రీనివాస్, వెంకటరెడ్డి, ప్రసాద్, శంకర్, సాయి, గౌస్, రాజు, రామస్వామి, సంపత్, రాజబాబు, తొడుపునూరి రమేష్, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్వార్టర్ల తొలగింపు సహేతుకం కాదు..

- నిర్ణయం వెనక్కితీసుకునే వరకు పోరాటాలు - ఖనిలో రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు


రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

గోదావరిఖని, జూలై 7: గోదావరిఖని శివాజీనగర్, హనుమాన్‌నగర్ ప్రాంతాల్లోని క్వార్టర్ల తొలగింపు సహేతుకంగా లేదని, రోడ్డు వెడల్పు పేర 82క్వార్టర్లను కూల్చివేయడం వెనుక కుట్ర ఉన్నదని పలువురు అభిప్రాయపడ్డారు. ఈఅంశంపై బాధితులు ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అభివృద్ధికి తామెవరం వ్యతిరేకులం కాదని, అయితే రోడ్డు వెడల్పు కోసం ఒకే వైపు 150ఫీట్ల మేర సింగరేణి క్వార్టర్లను కూల్చివేసి అందులో నివసిస్తున్న వారిని ఇబ్బందులకు గురి చేయడం హేతుబద్ధంగా లేదని పలువురు అభిప్రాయ పడ్డారు. మొదటి లైన్ తీసివేస్తే రోడ్డు కోసం 50ఫీట్ల మేర స్థలం ఏర్పడుతుందన్నారు. మిగిలిన రెండు లైన్లలోని 70క్వార్టర్ల తొలగింపు ప్రతిపాదనను విరమించుకోవాలని రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేశారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, ఆర్జీ-1 జీఎం శ్రీనివాస్ తమ నిర్ణయాన్ని సమీక్షించుకోవాల్సి ఉన్నదని రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న పలువురు అభిప్రాయపడ్డారు. క్వార్టర్ల తొలగింపు అంశంపై చివరి దాకా అన్ని పక్షాలను కలుపుకుని పోరాటాలు కొనసాగిస్తామని తీర్మానించారు. ఈ అంశంపై 82క్వార్టర్లలో నివసిస్తున్న కార్మికులు ఇప్పటికే అనేక నిరసనలు, పోరాటాలు నిర్వహించారు. కోర్టును ఆశ్రయించారు. ప్రజాభవన్, సింగరేణి భవన్ ముందు కూడా హైదరాబాద్‌లో నిరసనలు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమాల సందర్భంలో ప్రభుత్వం, సింగరేణి అధికారులు స్పందించిన తీరును కూడా రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చించారు. గోదావరిఖని పట్టణం పూర్తిగా మైనింగ్‌తో కూడుకున్నదని, మైనింగ్ కార్యక్రమాలు ముగిస్తే ఈ ప్రాంత ఉనికే ప్రశ్నార్థంగా మారుతుందని పలువురు అన్నారు. ఇప్పటికే ఓసీపీ వల్ల ఇక్కడి నివాసాల్లో ఉంటున్న ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పట్టణీకరణ విషయంలో ఈ అంశాలన్నింటిని పరిగణలోకి తీసుకుని పరిమితమైన అభివృద్ధి ప్రణాళికలు ప్రజల అవసరాల మేరకు చేపట్టాలని, పలు రాజకీయ పక్షాల నాయకులు పేర్కొన్నారు.

క్వార్టర్ల బాధితుల పక్షాన నాయకత్వం వహిస్తున్న తోట వేణు అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో బీజేపీ నాయకులు సుల్వ లక్ష్మీనర్సయ్య, టీడీపీ నాయకులు వీరేందర్, స్నేహసాహితి బాధ్యులు ఏలేశ్వరం వెంకటేశ్వర్లు, హ్యూమన్ రైట్స్ ప్రతినిధి కిరణ్‌జీ, న్యూ ఇండియా పార్టీ నాయకుడు వేముల అశోక్, ఎంఆర్‌పీఎస్ నాయకుడు ఉప్పులేటి పర్వతాలు,అడ్వకేట్ జేఏసీ నాయకుడు పులిపాక రాజ్‌కుమార్, మాల మహానాడు నాయకుడు శ్రీహరి, రాజేశ్వర్‌రావు, శేఖర్‌తో పాటు బాధిత సింగరేణి కుటుంబాల సభ్యులు పాలొన్నారు.